నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలి



ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న వైద్యులకు, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి. ప్రతీ చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రులు, వాటి పరిసరాల్లో నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలి. గంజాయి మత్తులో యువకులు ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి నెలకొంది. అటువంటి వారు ఆస్పత్రికి వచ్చినప్పుడు స్పృహ కూడా ఉండడం లేదు. వైద్య సిబ్బందికి రక్షణ అవసరం.

– డాక్టర్ పిలకా కృష్ణారెడ్డి (అంకాలజిస్టు)

సీసీ కెమెరాల ఏర్పాటుతోనే రక్షణ



ప్రజారోగ్య రంగంలో సేవలందిస్తున్న వారిలో మహిళలే ఎక్కువ శాతం ఉంటారు. రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు వారికి సెక్యూరిటీ అవసరం. ప్రతీ ఆస్పత్రి వద్ద సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. అప్పుడే వైద్యులు, సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వహిస్తారు.

– డాక్టర్ వాక చంద్రశేఖర్ రెడ్డి

క్లుప్తంగా

సింహాద్రప్పడు సేవలు మరువలేనివి



సింహాద్రప్పడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

సీతంపేట : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గుల్లిపల్లి సింహాద్రప్పడు వర్ధంతి సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సీతమ్మధార మండల అధ్యక్ష కార్యదర్శులు బి.దేముడుబాబు, పి.ఎస్.రెడ్డి తదితరులు సింహాద్రప్పడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, ఉద్యమం మరువలేనిదని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు రాజు, కె.ఎస్.వి.రమణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో 30న ఇంటర్వ్యూలు

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో 30న శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. ఎస్సార్ అకాడమీ, శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 50 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం ఐటీఐ కూడలిలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రతి నెలా ఒకటిన కార్మికులకు జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్‌ఈయూ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యు.శ్రీధర్‌ను మంగళవారం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ఉన్న స్క్రాప్‌ను త్వరితగతిన ఉపయోగించి లాభం చేకూర్చాలన్నారు. ప్లాంట్ సమస్యలను తమకు తెలియజేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ రెండు నెలల్లో ప్లాంట్‌కు మంచి పరిస్థితి వస్తుందని, అంత వరకు ఓపిక పట్టాలన్నారు. ప్లాంట్ పరిరక్షణకు తాము ఉమ్మడిగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడి నరేంద్ర, నమ్మి సింహాద్రి, కొమ్మినేని శ్రీనివాసరావు, రామస్వామి, పి.ఎస్.ఆర్.లక్ష్మణరావు, అట్ట అప్పారావు, మణికుమార్, లక్ష్మణ్, వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ బకాయిలు చెల్లించాలని వినతి

మహారాణిపేట: గత నెలలో సామాజిక పెన్షన్లు తీసుకోలేని వారికి సెప్టెంబర్ నెల పెన్షన్‌తో కలిపి బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం విదసం ప్రతినిధులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ గత నెల కొందరు వృద్ధులు, వికలాంగులు జూలై, ఆగస్టు మాసాల్లో పెన్షన్లు పొందలేకపోయారని, వారికి సెప్టెంబర్‌లో చెల్లించే పెన్షన్‌తో కలిపి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈతలపాక సుజాత, బాజీ ఓంకార్, కస్తూరి వెంకటరావు, రవి సంతోష్, ములంపాక అఖిల్ పాల్గొన్నారు.

31న ఈపీఎస్ - 95 పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం

ఉక్కునగరం : ఈపీఎస్ – 95 పెన్షనర్ల అసోసియేషన్ రెండో వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) ఈ నెల 31న నిర్వహించనున్నారు. ఉక్కు అధికారుల సంఘం (సీ) భవన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

ట్రాఫిక్ జామ్..!

- మర్రిపాలెంలో సిగ్నల్ లైట్లు పట్టించుకోని వాహనచోదకులు
- వాహనాల నియంత్రణలో ట్రాఫిక్ పోలీసులు విఫలం



మర్రిపాలెం మెయిన్ రోడ్డులో వెలగని సిగ్నల్ లైట్లు



మర్రిపాలెం మెయిన్ రోడ్డులో రెడ్ సిగ్నల్ ఉన్నా ప్రయాణాలు సాగిస్తున్న వాహనచోదకులు

మర్రిపాలెం : సిగ్నల్స్ ఏర్పాటు చేయించిన అధికారులు... వాహనాల నియంత్రణలో విఫలమవడంతో మర్రిపాలెం వాసులు నిత్యం ట్రాఫిక్ పద్మవలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. జీవీఎంసీ 51, 53 వార్డుల పరిధిలో విస్తరించి ఉన్న మర్రిపాలెం ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణలో ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటు జాతీయ రహదారి, అటు మెయిన్ రోడ్డులోనూ ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు.

విశాల మార్గంలోనూ ట్రాఫిక్ చిక్కులే

విశాలమైన బీఆర్‌టీఎస్ మార్గంలోనూ ట్రాఫిక్ అవస్థలు పెరిగిపోయాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మర్రిపాలెం మెయిన్ రోడ్డులో 6ఏ, 28ఏ, 28కే, 300సీ, 300ఎం, అరకు, ఎస్.కోట ప్రాంతాలకు అధిక సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ఈ మార్గం వాహనాలతో రద్దీగా వుంటుంది. ఇంత కీలకమైన మార్గంలో చాలా కాలంపాటు ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయలేదు. ఇటీవల కొత్తగా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ... అవి పనిచేయవులే అన్న భ్రమలో వాహనచోదకులు పట్టించుకోకుండా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఫలితంగా మర్రిపాలెం జంక్షన్‌లో అయోమయ పరిస్థితి నెలకొంటోంది. కంచరపాలెం జంక్షన్ నుంచి ఎన్ఏడీ కొత్తరోడ్డు, గాజువాక, గోపాలపట్నం, కొత్తవలస ప్రాంతాలకు మర్రిపాలెం మెయిన్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేవారంతా ట్రాఫిక్ సమస్యలతో నరకయాతన అనుభవిస్తున్నారు.



సిగ్నల్ కారణంగా హోటల్ మారియట్ వద్ద వరుసగా నిలిచిపోయిన వాహనాలు

ఆర్ అండ్ బీ సిగ్నల్‌తో ఇక్కట్లు

జాతీయ రహదారిపై మర్రిపాలెం జంక్షన్ కూడా నిత్యం వాహనాలతో రద్దీగా వుంటుంది. ఈ మార్గంలో 28 జెడ్/హెచ్, 111, 540, 541, 38 నంబరు సిటీ బస్సులు అనకాపల్లి, యలమంచిలి వెళ్లే 500, 500వై బస్సులు, ఇతర వాహనాలు వేలాదిగా రాకపోకలు సాగిస్తాయి. సాధారణంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే వాహనాల నియంత్రణ సులువవుతుంది. ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలను క్రమబద్ధీకరించడం పోలీసులకు కష్టతరంగా మారిపోయింది. జాతీయ రహదారిపై ఆర్‌అండ్‌బీ వద్ద సిగ్నల్స్ వల్ల వాహనాలు ఆగి వుండడం... అదే సమయంలో ఎదురెదురుగా కాలనీల్లో నుంచి వచ్చే వారంతా రోడ్డుపై వాహనాలు నిలిపేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇక్కడ వాహనాలు జాతీయ రహదారిని క్రాస్ చేయడం తలకుమించిన భారంగా పరిణమిస్తుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మాధవధార వైపు వెళ్లే వాహనదారులు కూడా ఈ కూడలి మీదుగా రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.

గెడ్డల్లో పూడిక తొలగింపు



మర్రిపాలెం మహారాణివీధి గెడ్డల్లో మట్టి దిబ్బలు తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం : జీవీఎంసీ 54, 56వ వార్డుల పరిధి కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం మహారాణివీధి, జ్యోతినగర్, సుభాష్‌నగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో మంగళవారం గెడ్డల్లో పూడికలు తొలగించారు. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక్కడి సమస్యలపై ఈ నెల 24న అధ్వానంగా గెడ్డలు శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి జోన్ – 5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ స్పందించారు. పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో పర్యవేక్షణలో ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ కార్యదర్శులు గెడ్డల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు, పొక్లెయిన్ సాయంతో తొలగించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అక్కయ్యపాలెం వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శ్రీలలితాపీఠంలో అలంకరణలో రాధాకృష్ణులు



ఉట్టి సంబరాల్లో పాల్గొన్న భక్తులు

సీతంపేట : అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో దేవదాయశాఖ పరిధిలో గల వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృత అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

- శ్రావణ బహుళ అష్టమి, రోహిణి నక్షత్రం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల శ్రీలలితా పీఠంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు విశేష పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్న

మురళీనగర్ : కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో వైభవునికి ఉదయాస్తమాన సేవలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అర్చనలు, మంగళా శాసనములు, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. వైభవుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 7 గంటలకు నిర్వహించిన ఉట్టి కొట్టు మహోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిరుపయోగంగా చెత్త కుండీలు



నిరుపయోగంగా వున్న చెత్తకుండీలు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ సమీపంలో గల చెత్తకుండీలు నిరుపయోగంగా వున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడి హాకర్స్ జోన్ సమీపంలో కొన్నేళ్ల క్రితం జోన్ – 3 ఇంజినీరింగ్ విభాగం అధికారులు రెండు చెత్త కుండీలు నిర్మించారు. ఒకటి తడి, మరొకటి పొడి చెత్త కోసం ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే వున్నా కాలక్రమేణా కుండీలు చెత్తతో నిండిపోవడం, పారిశుధ్య సిబ్బంది తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, చేపల వ్యర్థాలను ఇక్కడే వేస్తుంటారు. ఈ కుండీల పక్కనే మురుగునీరు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త తొలగించి, కుండీలు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఎట్టకేలకు రహదారికి మోక్షం



పోర్టు క్వార్టర్స్‌లో రోడ్డు నిర్మిస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధి పోర్టు సీతారామ కల్యాణ మండపం నుంచి పోర్టు వాటర్ ట్యాంక్‌కు వచ్చే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ – 1, 2, సింహగిరి కాలనీ వంటి కొండవాలు ప్రాంత ప్రజలు నిత్యం ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రోడ్డు అభివృద్ధి విషయంలో పోర్టు, జీవీఎంసీ అధికారులు సంబంధం లేనట్లు ఇన్నాళ్లూ వదిలేశారు. ఇనార్బిట్ మాల్ వెనుక వైపు రోడ్డును అభివృద్ధి చేసినా ఈ రహదారిని మాత్రం పట్టించుకోలేదు. ఎట్టకేలకు పోర్టు అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో పోర్ట్ ట్రస్ట్ మంగళవారం రోడ్డు నిర్మించింది. దీంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెట్టు కొట్టారు.. తరలింపు మరిచారు..



రోడ్డు పక్కనే వదిలేసిన చెట్టు, కొమ్మలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలో రోడ్డు పక్కనే చెట్టు, కొమ్మలు వదిలేయడంతో పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడి బృందావన్ పార్కు ప్రాంతంలో కొద్ది రోజుల క్రితం ఒక చెట్టు కూలిపోయింది. దీంతో జీవీఎంసీ జోన్ – 3 ఉద్యానవన విభాగం సిబ్బంది చెట్టుని ముక్కలుగా నరికి రోడ్డు పక్కనే వదిలేయడం గమనార్హం. సాధారణంగా ఈపీడీసీఎల్ కాంట్రాక్టర్ కొట్టి వదిలేసే చెట్టు కొమ్మలను సంబంధం లేకపోయినా తొలగించే పారిశుధ్య సిబ్బంది... జీవీఎంసీ ఉద్యానవన విభాగం తొలగించిన చెట్టుని తరలించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యానవన విభాగంలో సిబ్బంది, వాహనాల కొరత వల్ల ఎక్కడ చెట్లు పడిపోయినా సకాలంలో తరలించడం లేదు. పార్కు పక్కనే చెట్టు వ్యర్థాలు పేరుకుపోవడంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బంది స్పందించి వ్యర్థాలు వెంటనే తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వర్టుపై ఫుడ్ కౌంటర్లతో ట్రాఫిక్ కష్టాలు



బాక్స్ కల్వర్టుపై ఏర్పాటు చేసిన ఫుడ్ కౌంటర్లు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా ఎస్ఎఫ్ఎస్ స్కూలు వద్ద గల గెడ్డపై జోన్ – 3 అధికారులు నిర్మించిన బాక్స్ కల్వర్టుపై ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. గతంలో ఓపెన్‌గా వున్న భాగంలో రూ.18 లక్షలు వెచ్చించి బాక్స్ కల్వర్టు ఏర్పాటు చేశారు.

దీంతో ఇక్కడి మార్గం విశాలంగా మారిందని సంతోషించేలోపే ఆక్రమణలు పెరిగిపోయాయి. ఇక్కడ ఫుడ్స్, స్నాక్స్ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇరుకుగా మారిపోయింది. ఒకవైపు జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్ల పక్కన ఆక్రమణలు తొలగిస్తుంటే మరోవైపు వ్యాపారులు దర్జాగా కల్వర్టునే ఆక్రమిస్తుండడం గమనార్హం. కల్వర్టుపై ఫుడ్ కౌంటర్ల ఏర్పాటుతో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోయాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

శంకరమఠం రోడ్డులో అంధకారం





వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో శంకరమఠం రోడ్డు

సీతంపేట : నగరంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన శంకరమఠం రోడ్డులో గత వారం రోజులుగా అంధకారం నెలకొంది. జాతీయ రహదారి నుంచి వాహనాలు నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గమైన శంకరమఠం రోడ్‌లో వీధి దీపాలు వెలగక రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటోంది. వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నాయా..? లేదా..? పర్యవేక్షించే నాథుడు కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా లైట్లు వెలగకపోయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదంటున్నారు. శంకరమఠం, రామలింగేశ్వరాలయం, క్రాస్ బేకరీ నుంచి జాతీయ రహదారి వరకు రోజూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని వాపోతున్నారు. కొద్ది నెలల కిందట శంకరమఠం రోడ్డులో వెళ్తున్న వారిని దుండగులు దోచుకున్న సంఘటనలు గుర్తు చేసుకుని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మానవ మృగాలకు ఉరే సరి



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

గోపాలపట్నం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడిన మానవ మృగాలను ఉరి తీయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు, హెల్త్ వలంటీర్లు డిమాండ్ చేశారు. 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ-బ్లాక్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విదసం ఐక్యవేదిక కో-కన్వీనర్ సోడదాసి సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దోషులు ఎంతటి వారైనా ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. రైల్వే యూనియన్ నాయకుడు డెంకాడ ఆనంద్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. హెల్త్ వలంటీర్ అనూష మాట్లాడుతూ ప్రాణాలను నిలబెట్టే వారిపై మృగాల్లా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వారు సభ్య సమాజంలో బతికే అర్హత కోల్పోయారన్నారు. అలాంటి వారిని రక్షించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సమాజాన్ని ప్రమాదకర పరిస్థితిలోకి నెట్టేయడమే అవుతుందన్నారు. ఇటువంటి చర్యలను ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బండారు తులసీరామ్, కె.సంజీవరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలతో టీచర్లపై అదనపు భారం

యూటీఎఫ్



డిప్యూటీ డీఈవో సువర్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు బోధనేతర పనులను పూర్తిగా మినహాయించి.. కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డిప్యూటీ డీఈవో సువర్ణకు జిల్లా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే సంతోషించామని, కానీ ప్రస్తుత చర్యలు మరింత భారం పెంచేలా ఉన్నాయన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయకపోతే అందుకు హెచ్ఎంలు బాధ్యత వహించాలనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటల నుంచి మూడున్నరలోపు పది అంశాలతో కూడిన గూగుల్ ఫాం పూర్తి చేసి హెచ్ఎంలు అప్‌లోడ్ చేయాలని చెప్పడం అదనపు భారమేన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, నాయకులు కె.రాంబాబు, ఉప్పాడ రాము, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం 1293వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రజా మద్దతు కూడగట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేస్తామన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.5 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రజాధనంతో నిర్మించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూడడం సబబుకాదన్నారు. వరసాల శ్రీనివాసరావు, మసేనురావు, కె.రాజబాబు, జి.జయ, తాండ్ర కనకరాజు, ఎ.శివరామకృష్ణ, తుమ్మల శ్రీనివాస్, జి.ఆనంద్, రాజు పాల్గొన్నారు.